

కథా కౌముది

# నాకు నువ్వు...నీకు నేను

పిడపర్తి భారతి

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

**వంటింటి నుండి** వీధి గుమ్మం వరకు ఒకటే పచార్లు మొదలుపెట్టింది, అన్నపూర్ణ.

"ఇంకారారేమిటీయన. ఎంతసేపు పక్క వీధిలోనున్న స్నేహితుడు, కామేశ్వర్రావుగారి ఇంటికి వెళ్ళొస్తానన్నాయన. ఇంతసేపా? స్నేహితుడ్ని చూస్తే ఒళ్ళే తెలియదు ఈయనకి. ఇంకా రారేమిటీ" అంటూ గొణుక్కుంటోంది.

వీధివైపు ఒకసారి చూసి, వంటింట్లోకి వెళ్ళి, కూర ఒకసారి కలిపి, స్టౌవ్ ఆపేసి, చేతులు తుడుచుకుంటూ, హాల్లోకి వచ్చేసరికి, లోపలకి వస్తూ కనబడ్డారు, శంకర్రావుగారు. వస్తూనే,

"పూర్ణా! కాసిని మంచి నీళ్ళు ఇయ్యి" అంటూ హాల్లో సోఫాలో కూర్చుంటూ.

"అమ్మాయి ఫోన్ చేసిందండీ" అంది నెమ్మదిగా.

నీళ్ళు తాగి, గ్లాస్ టేబుల్ మీద పెట్టి, "అంతా బావున్నారా?" అన్నారు.

"ఆ.. అంతా బావున్నారుట. వాళ్ళ అత్తగారు, మామగారు కలిసి, వాళ్ళ మరిది దగ్గరకి అమెరికా వెళ్ళారుట. వాళ్ళు ఆరునెలలదాకా రారట."

"ఊ.. అన్నంపెట్టు. ఆకలేస్తోంది. ఏమిటి, వంట ఇవాళ?" అంటూ గదిలోకి వెళ్ళి పంచె కట్టుకుని వచ్చారు, శంకర్రావు గారు.

ఒక్క నిట్టూర్పు విడిచి, వంటింట్లోకి నడిచింది, అన్నపూర్ణ.

అప్పటికి ఇంకేమీ అనకుండా ఊరుకుంది, పూర్ణ.

భోజనం చేసి, ఆయన కాసేపు పడుకుని లేచి కాఫీ తాగుతారు.

కాఫీ ఆయన చేతికిచ్చి, "మీరు అసలు నా మాట పూర్తిగా విననేలేదు" అంటూ మొదలుపెట్టింది అన్నపూర్ణ.

తలెత్తి సందేహంగా చూసారు, శంకర్రావుగారు.

"అమ్మాయి మన ఇద్దర్నీ కలిసి బెంగుళూరు రమ్మంటోందండీ" అన్నారు, పూర్ణ.

"ఇప్పుడెందుకు అక్కడకు వెళ్ళడం?" అన్నారు ఆశ్చర్యంగా.

"ఎందుకేమిటో?" మూతి ముడుచుకుని అన్నారు, పూర్ణా.

"అంటే ఏదైనా పనివుంటే వెళ్ళాలి కాని, తీరికూర్చుని ఎందుకు వాళ్ళింటికెళ్ళి వుండడం?" అన్నారు.

"కాదండీ మన అమ్మాయికి కూడా తన తల్లితండ్రుల్ని కొంచెం రోజులు తన దగ్గర ఉంచుకోవాలని ఉండదా అలా అంటారేమిటి?"

"అదికాదు పూర్ణా! కావాలంటే వాళ్ళనే ఇక్కడకి రమ్మనమను."

"లేదు, పిల్ల రమ్మంది. మనం వెళ్ళాల్సిందే" అంది పూర్ణ.

"ఇంక నీకు చెప్పలేను. సరే నీ ఇష్టం. అలాగే వెళ్దాం."

ఇంక పూర్ణ హడావుడి మొదలయింది.

అల్లుడికి ఇష్టమని ఊరగాయలు, కూతురికి ఇష్టమని రెండు, మూడు రకాల వడియాలు, పిల్లలకి ఇష్టమని మినప్పిండి జంతికలు, తీపిలేకుండా ఎలా అని రెండు, మూడు రకాల స్వీట్స్ ఇలా ఎన్నో రకాలు పేక్ చెయ్యడం మొదలుపెట్టింది.

ఇలా వారం, పదిరోజులు గడిచాయి.

కూతురు, దుర్గ నుండి మళ్ళీ కాల్ వచ్చింది.

"ఏమిటమ్మా మళ్ళీ ఫోన్ చేసి, ఎప్పుడు వచ్చేదీ చెప్పద్దా?" అని బిగ్గరగా అంటున్న దుర్గ మాటలకి పూర్ణ ఆశ్చర్యపడింది.

"అదేమిటే నువ్వేగా టికెట్స్ బుక్ చేస్తాను, రెడీగా ఉండండమ్మా" అన్నావు, అంటున్న తల్లి మాటల్ని అడ్డుకుంటూ, "అది సరేనమ్మా నువ్వు మంచి రోజు చూస్తావు, మళ్ళీ నాన్నకి ఏదో పని ఉందంటావు. ఇలా ఏదో సాకులు చెప్తావు, నాకు కరెక్ట్‌గా చెప్పాలికదా" అంది దుర్గ.

మనసు చివుక్కుమంది, పూర్ణకి. మంచి రోజంటే చాదస్తం అంటారు. సరిపెట్టుకుని, ఏరోజైనా మంచి రోజే అనుకుని ఊరుకుంటే ఇలా అంటారు.

"ఏమిటి మాట్లాడవు?" అంటోంది, దుర్గ ఫోన్‌లో.

"ఏంలేదు" అన్నారు, అన్నపూర్ణ.

"ఏమిటి ఆలోచిస్తున్నావు, మాట్లాడకుండా" అంది దుర్గ.

"ఏమీలేదు, నువ్వు చెప్పు" అంది పూర్ణ.

"ఎందుకు అలా మాట్లాడుతున్నావు?" అంది దుర్గ.

"బావుందే ఎలా మాట్లాడుతున్నాను, బాగానే మాట్లాడుతున్నాగా" అంది పూర్ణ.

"ఏమో అమ్మా, నాన్నతో మాట్లాడి, నువ్వు నాకు కరెక్ట్‌గా చెప్పు, అప్పుడు టిక్కెట్స్ బుక్ చేస్తాను."

"టికెట్స్ బుక్ చెయ్యమ్మా నేనప్పుడే రెడి అయిపోతున్నాను. మొన్న మార్కెట్‌కెళ్ళి, కావలసినవన్నీ కొనుక్కొచ్చాను. అల్లుడికి ఊరగాయలు ఇష్టమని, నీకు వడియాలు ఇష్టమనీ."

తల్లి మాట పూర్తికాకుండానే, "అమ్మా! ఆ చెత్తంతా మోసుకురాకు. ఈ రోజుల్లో కూలీలు కూడా దొరకటంలేదు. ఎందుకమ్మా, అంత శ్రమపడతావు?" అంది గట్టిగా దుర్గ.'

"అయ్యో అదేమిటే, అలా అంటావు? అమ్మమ్మా ఏమి తెచ్చావు, మాకోసం అంటూ అడిగే నీ పిల్లలకి ఏమి సమాధానం ఇవ్వాలి?" అన్నారు, పూర్ణ.

"అమ్మా! మా వాళ్ళకి అలాంటివేమీ తెలియదు. బబ్లూకయితే ఇంకా చాక్లెట్స్ కూడా ఇవ్వటంలేదు మేము. వాళ్ళకి అలాంటివేమీ అలవాటు చెయ్యకు. సరే మళ్ళీ రేపు ఇదే టైంకి కాల్ చేస్తాను. నేనడిగిన దానికి నాన్ననడిగి సమాధానం చెప్పు. బబ్లూ ఎందుకో ఏడుస్తున్నాడు. వుంటాను" అంటూ, తల్లి జవాబుకోసం ఎదురు చూడకుండానే ఫోన్ పెట్టేసింది, దుర్గ.

పనిమీద బైటకి వెళ్ళిన శంకర్రావుగారు ఇంటికి వచ్చేసరికి బిక్కమొహం పెట్టుకుని కూర్చున్న అన్నపూర్ణని చూసి, "ఏమయింది, పూర్ణా?" అన్నారు.

పూర్ణ దుర్గ ఫోన్ చేసి చెప్పిందంతా వివరంగా చెప్పింది.

శంకర్రావుగారు ఒక నిట్టూర్పు విడిచి, "సరే అది చెప్పినట్టే చెయ్యి అనవసరంగా హైరానపడకు. రేపు ఫోన్ చేసినపుడు తను ఎప్పుడు టికెట్ కొంటే అప్పుడు వస్తామని చెప్పు. తనేమన్నా ఎక్కువ వాదించకుండా తను ఎలా చెపితే అలా చేస్తామని చెప్పు" అన్నారు.

"ఎలాగండీ? అప్పుడే ఇవన్నీ చేసుకుని కూర్చున్నానుగా" అని బేలగా అన్నారు, పూర్ణ.

"మరి ఏమి చేస్తాము చెప్పు. అన్నీ ఇక్కడే వదిలేసి వెళ్దాం. మళ్ళీ వచ్చాక మనమే వాడుకోవచ్చు." అన్నారు.

మర్నాడు దుర్గ ఫోన్ చేసినపుడు శంకర్రవుగారు చెప్పమన్నట్టే చెప్పింది.

"అమ్మా! రెండురోజుల్లో టికెట్ కొంటాను. కానీ మీరు ఇక్కడ రెండు, మూడు నెలలు ఉండేలా రావాలి. అలా ప్రిపేరయి రండి" అంటూ సమాధానం కోసం కూడా చూడకుండా ఫోన్ పెట్టేసింది.

మళ్ళీ దంపతులిద్దరి మధ్యా వాదన మొదలయింది.

రెండునెలలంటే నేను రానని శంకర్రావుగారు గొడవ. అన్నపూర్ణగారికి కూడా ఇష్టంలేకపోయినా కూతురు రమ్మంటోందనీ, ఈ విధంగా మనవళ్ళని చూడచ్చనీ, వాళ్ళతో కొన్నాళ్ళు గడపవచ్చని, ఆవిడ ఆశ.

ఇంక శంకర్రావుగారికి తప్పలేదు. అన్నపూర్ణ అన్నీ సర్దడం మొదలుపెట్టింది. రెండు నెలలు ఉండరు కాబట్టి ఉన్న సరుకులన్నీ ఖాళీ చేసి, కొన్ని చేయాల్సిన బ్యాంక్ పనులు, ఇతర పనులు ముగించుకుని, ఇరుగుపొరుగు వారికి ఇల్లు జాగ్రత్త అంటూ చెప్పి, మొత్తం మీద బెంగుళూరు ప్రయాణం కట్టారు.

అల్లుడు నరేంద్ర స్టేషన్‌కి వచ్చాడు. ఇంటికి వెళ్ళేసరికి దుర్గ ఆప్యాయంగా ఎదురొచ్చి, కుశలప్రశ్నలయ్యాక కాఫీ కలిపి ఇచ్చింది.

తండ్రి స్నానానికి వెళ్ళగానే దుర్గ తల్లి దగ్గరకి వచ్చి, "అమ్మా! పిల్లలు ఇంకా లేవలేదు. లేచారంటే ఇంక నీతో మాట్లాడడానికి కూడా నాకు టైం దొరకదు. పెద్దవాడు నానీ ఇప్పుడు మూడో క్లాస్‌కి వచ్చాడు. వాడు లేవగానే తయారుచేసి స్కూల్‌కి పంపించాలి. ఇంక బబ్లూ లేచాడంటే విపరీతమైన అల్లరి మొదలెడతాడు. వాడ్ని పట్టుకునేసరికి నా ఓపికంతా పోతుంది. వచ్చే జూన్‌కి వీడ్ని కూడా స్కూల్లో వెయ్యాలి. ఈరోజుకి నేను వంట చేసేసాను. రేపటినుండి అన్నీ నువ్వే చూసుకోవాలమ్మా. కిచెన్‌లోకి వస్తే ఏవి ఎక్కడున్నాయో నీకు వివరిస్తాను" అంటూ వంటింట్లోకి తీసుకెళ్ళి అన్నీ చెప్పడం మొదలుపెట్టింది. పూర్ణ అన్నీ వింటూ "ఊ" కొడ్తుంది.

ఈలోగా శంకర్రావుగారు, పిలిచేసరికి పూర్ణ వెళ్ళి ఆయనకి కావల్సినవి ఇచ్చి, వచ్చింది. తల్లి తెచ్చినవన్నీ చూసి దుర్గకి ఎక్కడలేని కోపం వచ్చింది.

"నేనెంత చెప్పినా సరే నా మాట వినకుండా తెచ్చారు ఇవన్నీ" అంటూ చాలా గొడవ చేసింది. ఆఖరికి నరేంద్ర కల్పించుకుని, "ఏదో ప్రేమగా తెచ్చారు ఇప్పటికి వదిలేయి" అనంటే అప్పటికి ఊరుకుంది. అన్నపూర్ణ మనసు చిన్నబోయింది. కూలీలు కూడా ఎవరూ దొరకరు అందని తను నాలుగు కట్టుడు చీరలూ, రెండు కాస్త మంచి చీరలు మాత్రమే తెచ్చుకుని, తను చేసినవన్నీ సర్దుకుని వచ్చింది. అంతకీ శంకర్రావుగారు అంటూనే ఉన్నారు "నాలుగు చీరలు చాలా నీకు" అంటూ.

"ఆ.. ఏంఉంది? ఒక చీరకట్టుకుంటే ఒక చీర ఆరేసుకుంటాము" అనుకుంటూ వచ్చింది.

దుర్గా వాళ్ళు మూడు బెడ్రూములున్న ఫ్లాట్‌లో ఉంటున్నారు. తల్లీతండ్రికీ తన అత్తమామలు ఉండేగది ఇచ్చింది, దుర్గ.

దుర్గ ఆ రూములోకి వచ్చి "అమ్మా! మీరు రోజూ కట్టుకునే బట్టలు ఈ అలమారులో పెట్టుకోండి అస్తమానం పెట్టె తీసుకోవాలంటే కష్టంకదా" ఎంతో ప్రేమగా అంటూ అక్కడున్న వార్డ్‌రోబ్‌లో ఒక వైపున చిన్న అలమారు తలుపు తీసింది. అందులో నాలుగు చిన్న అరలున్నాయి. అందులో రెండు అరలలో ప్లాస్టిక్ డబ్బాలలో ఏవేవో సామానులున్నాయి. ఇంక

రెండు అరలు మిగిలాయి. తల్లి చూస్తున్న వైపు చూసిన దుర్గ, "అమ్మా ఆ పై రెండు అరలలోనూ ఉన్న సామానేమీ ముట్టుకోకండి మా అత్తగారి గురించి నీకు తెలుసుగా అయినా పెళ్ళికి ముందు ఎంత మంచిగా మాట్లాడిందమ్మా. ఇప్పుడు చూడు ఎలా ఆడిస్తోందో" అంది దుర్గ.

"పోనీలే దుర్గా సాధారణంగా మనం ఏ కొడుకైనా తల్లితండ్రుల్ని చూడకపోతే, ఎంత దుర్మార్గుడో ఆ కొడుకు. అనుకుంటామా లేదా. అలాగే ఒక కొడుకు తల్లితండ్రుల్ని అంత బాగా చూసుకుంటుంటే అది కూడా చెప్పుకోవాలి" అంది పూర్ణ ఆ సంగతి అక్కడితో వదిలేయమన్నట్లుగా.

"అంతే. నువ్వు అలాగే చెపుతూ వుండు. ఆవిడ చూడు చిన్న కొడుకింటికి వెళ్ళినా అక్కడ్నించే మా మీద పెత్తనం చెలాయిస్తోంది. నువ్వూ ఉన్నావు ఎందుకూ కొడుకుని సరే. కోడల్ని ఒక్కమాట అనవు, అననీయవు." అంటూ "ఏమంటున్నాడు నీ ముద్దల కొడుకు? మిమ్మల్ని అమెరికాకి ఎప్పుడు పిలుస్తాడుట? అసలు వాడికి ఇక్కడ ఒక అక్క ఉందని గుర్తుందోలేదో ఎప్పుడో ఒకసారి కాని ఫోన్ చెయ్యడు. అయినా నువ్వు చెప్పొచ్చుకదమ్మా, వాడికి అప్పుడప్పుడైనా బావగారికి ఫోన్ చేసి, ఎలా ఉన్నారని అడగొచ్చుకదా" తమ్ముడు మీద మొదలుపెట్టింది.

పూర్ణకి ఏమి చెప్పాలో తెలియలేదు. దుర్గ తమ్ముడు గురించి ఇలా అంటుంది.వాడేమో "నాకలాంటి ఫార్మాలిటిస్ ఇష్టముండవమ్మా అక్కకి రోజూ ఫోన్ చేసి ఎలా ఉన్నావని అడిగేకన్నా తనకి ఎప్పుడు ఏమవసరం వచ్చినా నేను తనకి ఉన్నాననే ధైర్యం కల్పిస్తే చాలు. నేను అదే అక్కకి ఎన్నోసార్లు చెప్పాను. నాకు ఇవన్నీ నచ్చవమ్మా" అంటాడు.

మళ్ళీ అక్కాతమ్ముళ్ళిద్దరికీ ఒకళ్ళంటే ఒకళ్ళకి ఎంతో ప్రేమ. తల్లికి ఫోన్ చేసిన ప్రతిసారీ అక్క ఎలా ఉందని ఆదిత్య అడుగుతాడు. ఆదీ ఎలా ఉన్నాడని దుర్గ అడుగుతుంది. దేశం కాని దేశంలో ఉన్నాడు, జాగ్రత్తగా ఉండమని చెప్పమ్మా అని దుర్గ అంటే, అమ్మా అక్కకి ఏమైనా కావాలేమో గమనించుకుంటూ ఉండమ్మా ఏ సహాయమైనా సరే మొహమాటపడకుండా చెప్పమని అక్కకి చెప్పు. అది మాట సాయమైనా, ఆర్థిక సహాయమైనా సరే నాకు చెపితే వెంటనే చేస్తాను. మర్చిపోకు, అని ఆదిత్య అంటాడు. అది తలచుకుని నిట్టూర్చారు, పూర్ణ.

దుర్గ మనసు మంచిదే కానీ కోపం వస్తే ఏ మాటైనా అనేస్తుంది. అందులో అమ్మంటే ఇంకా స్వతంత్ర్యం.

దుర్గ, నరేంద్ర ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్. ప్రొద్దున్నే వెళితే మళ్ళీ సాయంత్రం ఆలశ్యంగా వస్తారు.

కూతురు కోసం పూర్ణ, శంకర్రావుగారు బిజీ అయిపోయారు. శంకర్రావుగారు నానీని రెడీచేసి, స్కూల్ బస్ ఎక్కించడం మళ్ళీ సాయంత్రం తీసుకురావడం, హోం వర్క్ చేయించడం, సాయంత్రం పార్క్‌కి తీసుకెళ్ళడం, అన్నదమ్ములిద్దరూ దెబ్బలాడుకోకుండా చూడడం ఇలా.. ఎన్నో.

అలాగే పూర్ణకి కూడా, వంటమనిషి, పనిమనిషి ఉన్నా కూడా ఖాళీలేకండా పని. వంటమనిషి ఉన్నా ప్రొద్దున్న బ్రేక్ఫాస్ట్, సాయంత్రం స్నాక్ మాత్రం పూర్ణే చేస్తుంది. అదికాకుండా బబ్లూకి తినిపించడం, కూతురు అల్లుడు వచ్చేసరికి ఇల్లు నీటుగా ఉంచడం ఇలా ఎన్నో.

అసలు బబ్లూని పట్టుకోవడమే పెద్ద కష్టం. కావలసిన కూరలు, పళ్ళూ, సరుకులు దుర్గకి చెపితే, దుర్గ ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చి తెప్పిస్తుంది.

ఒకసారి దుర్గ "ఈ పనిమనిషి, వంటమనిషిల దగ్గర ఏమీ మాట్లాడకమ్మా వీళ్ళిద్దరూ మా అత్తగారి ఏజెంట్లు" అంది.

"పోనీలే అమ్మా! మనకెందుకు అయినా నీకు తెలుసుగా నేను ఎవరి దగ్గరా ఎక్కువగా మాట్లాడను" అంది పూర్ణ.

పూర్ణకి నెమ్మదిగా వాళ్ళ ఆహార అలవాట్లు తెలిసాయి. అన్నీ వాళ్ళ ఇష్టానికే చెయ్యాలి. ఎప్పుడైనా పూర్ణ ఇంకో విధంగా చేయమని చెపితే, "అన్న తినడమ్మా" అంటూ వాళ్ళ పద్ధతిలోనే చేసేస్తుంది. బబ్లూ తినేది వేరు, నానీ తినేది వేరు, నరేంద్ర తినేది వేరు( కొంచెం కారంగా).

అలా చూసి, పూర్ణ, శంకర్రావులు కూడా దానికే అలవాటుపడిపోయారు. పాపం శంకర్రావుగారయితే ఉల్లీ, వెల్లుల్లీ కూడా తినని మనిషి, ఏదో పొడో, ఊరగాయోతో కానిచ్చేస్తున్నారు. కొత్తలో దుర్గ, "అమ్మా! మీకు కొంచెం వేరేగా తీయించుకో" అంటే పూర్ణ ఆ వంటామెకి చెపితే సరేనని ఒక్క రోజు తీసిందంతే. ఒకరోజు అడిగితే, రోజూ ఎలా వీలవుతుందమ్మా అంటూ ఇంకో మాటకి అవకాశం లేకుండా వెళ్ళిపోయింది. ఇంక మళ్ళీ అడగలేదు పూర్ణ.

ఇలా ఒక నెల గడిచేసరికి పూర్ణ, శంకర్రావులిద్దరూ కూడా బాగా అలిసిపోయారు. శంకర్రావుగారయితే ఎప్పుడెప్పుడు తమ ఊరు వెళ్ళిపోదామని చూడడమే కాకుండా, దుర్గకి చెప్పి, ప్రయాణానికి టికెట్స్ తెప్పించమని రోజూ పోరుపెట్టడం మొదలుపెట్టారు. అలాగే ఎలాగో ఇంకో నెల గడిచిపోయింది. పిల్లలిద్దరూ బాగా అలవాటుపడిపోయారు.

ఒకరోజు ఆదిత్య తల్లికి ఫోన్ చేసాడు. "అమ్మా మీరంతా ఎలా ఉన్నారు?" అని అడిగి, నెమ్మదిగా అసలు విషయం చెప్పాడు.

"అమ్మా నళినికి ఇప్పుడు ఐదోనెల. అందుకని వాళ్ళ అమ్మానాన్న వచ్చేవారంలో ఇక్కడికి వస్తున్నారు. వాళ్ళ అబ్బాయి కూడా ఇక్కడే ఉన్నాడు కాబట్టి, వాళ్ళు చాలా రోజులే ఉంటారు. మీరు కూడా వస్తే బావుంటుంది. అందుకే మీరు వెంటనే ఊరు వెళితే మంచిది. అక్కడ మీ పనులన్నీ చక్కబట్టే సరికి ఎన్నినెలలవుతాయో ఏమో? అక్కకి చెప్పి వెంటనే బాయ్లేరండి."

ఈమాట వినగానే పూర్ణ సంతోషం పట్టలేకపోయింది. కొడుకు అమెరికా రమ్మన్నాడనేకన్నా, కోడలు నీళ్ళోసుకుందనే విషయానికే బాగా సంతోషపడ్డారు, అన్నపూర్ణ, శంకర్రావుగార్లు.

దుర్గరాగానే సంతోషంగా విషయం చెప్పి, ప్రయాణానికి టికెట్స్ కొనమంది పూర్ణ. దుర్గకి చాలాకోపం వచ్చేసింది.

"ఐదో నెల వచ్చాక ఇప్పుడు చెప్తాడా వాడు, మీకు. ముందే వాళ్ళ అత్తగారి వాళ్ళకి చెప్పేసుంటాడు చూడు వాళ్ళప్పుడే వెళ్ళిపోతున్నారు. మీకు కూడా అప్పుడే చెప్పొచ్చుగా? ఏమిటమ్మా వీడు?" అంటూ విసుక్కుంది.

"పోనీలే తల్లీ ఏదో చెప్పాడు కదా ఆ మాట వదిలేయ్. మా టికెట్స్ సంగతి చూడు. ఇంక మేము వెళ్ళాలి"అన్నారు, పూర్ణ.

"అంతే వదిలేయ్. అన్నీ వదిలేయ్. నువ్వెప్పుడూ అంతే. అయినా ఏమిటి వెళ్ళేది? అంతకు ముందు మీకెంత పనుంటుందో తెలుసా మీకు. మెడికల్ చెకప్స్ ఉంటాయి" అంది దుర్గ.

"ఆ అవునే మా పక్కింటావిడ చెప్పింది ఆవిడ వెళ్తూనే ఉంటుందిగా. ఎన్నాళ్ళుంటారో అన్నాళ్ళకి సరిపడా మందులన్నీ కూడా  పట్టుకెళ్ళాలిటకదా."

"అదొక్కటే కాదమ్మా మీరు  మీ పళ్ళు, కళ్ళు చెవులు ఇలా అన్నీ చెక్ చేయించుకోవాలి, జనరల్ హెల్త్ చెకప్‌తో సహా. వీటన్నింటికీ మీరిద్దరే తిరగాలి. అక్కడనుండి మీరు వచ్చేయండని వాడు చెప్పడం మీరు నా కొడుకు నన్ను రమ్మన్నాడంటూ తయారయిపోతున్నారు. సరే కొంటానులే టిక్కెట్స్" అంటూ విసుక్కుంది.

అన్నపూర్ణ, శంకర్రావుగార్లు మొత్తం మీద రెండున్నర నెలల తర్వాత తమ ఇంటికి వచ్చారు. అంతకుముందు దుర్గ మాటలకి బాధపడిన వాళ్ళిద్దరూ, అవన్నీ మర్చిపోయారు. కొత్త ఉత్సాహం పుట్టింది.

ఇంక అక్కడనించి కసరత్తు మొదలయింది. దుర్గ కూడా రోజూ ఫోన్ చేస్తూ, ఏ పని ఎక్కడివరకు వచ్చిందో తెలుసుకుంటూ, విసుక్కుంటూనే సలహాలిస్తోంది.

డాక్టర్ బిల్స్ అన్నీ దుర్గే కట్టింది.

"ఎందుకమ్మా?" అంటే "మా కంపెనీ ఇస్తుందమ్మా దాని గురించి వర్రీకాకు" అంటూ మళ్ళీ విసుక్కుంది.

మొత్తం మీద అన్ని పనులు ముగించుకుని సిద్దంగా ఉన్నామని చెప్పాక, ఇదుగో అదుగో అంటూ, నెమ్మదిగా ఆదిత్య టికెట్స్ కొనేసరికి కోడలి డెలివరీ డేట్ దగ్గరపడింది.

వీళ్ళు వెళ్ళిన మర్నాడే కోడలికి బాబు పట్టాడు. నళిని తల్లితండ్రులు ముందే వచ్చారు కాబట్టి వాళ్ళకి అక్కడంతా అలవాటయింది. పూర్ణ, శంకర్రావులు జరిగేవన్నీ చూస్తూ కూర్చున్నారు.

ఒకరోజు ఆదిత్య తల్లి దగ్గరకి వచ్చి, పక్కన కూర్చుని "ఏమిటమ్మా ఇది? మీరు కూడా కొంచెం సహాయం చెయ్యొచ్చుగా పాపం అన్నీ మా అత్తగారు, మామగారే చేస్తున్నారు."

పూర్ణ మనస్సు చివుక్కుమంది. "అదికాదురా మాకు అవన్నీ ఎలా వాడాలో తెలీదు. వాళ్ళయితే ముందే వచ్చారు కాబట్టి అన్నీ తెలిసాయి. అంతకీ నేను కిచెన్‌లో ఆవిడతోనే ఉండి ఏమైనా పని ఉంటే అందుకుని చేస్తూనే ఉన్నాను" అన్నారు పూర్ణ కొంచెం చిన్నగా.

"వాళ్ళు వచ్చి తెలుసుకున్నారుగా అలాగే మీరూ తెలుసుకోండి. అయినా అన్నింటికీ అలా అడ్డమెళ్ళిపోకమ్మా అయినా నాన్న ఏమిటి రోజుకి అన్ని కాఫీలు తాగుతున్నారు ఆయన హెల్త్ గురించి పట్టించుకోవా నువ్వు" అంటూ లేచి "ఆయన్ని కొంచె కాఫీలు తగ్గించమను. పైగా ఆ దగ్గొకటి" అన్నాడు.

"నాన్న దగ్గు గురించి నీకు తెలుసుకదరా సీజనల్. ఇక్కడికి వచ్చేముందేగా అన్ని టెస్టులు చేయించుకున్నాం. అంతా బాగానే ఉంది" అంది పూర్ణ.

"సరే వస్తానమ్మా" అంటూ వెళ్ళాడు ఆదిత్య.

పూర్ణకి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. పక్కకి తిరిగి కళ్ళు తుడుచుకుని, నెమ్మదిగా లేచి, వంటింట్లో కాఫీ పెడుతున్న నళిని అమ్మగారి దగ్గరకి వెళ్ళి, "నాకు కూడా కొంచెం నేర్పించండి" అంది.

ఆవిడ వెంటనే "అయ్యో వదినగారూ మీకెందుకు? నేనున్నానుగా మీరెళ్ళి కూర్చోండి" అన్నారు.

"పర్వాలేదండీ నాకు చెప్పండి, ప్లీజ్"అన్నారు, పూర్ణ.

నెమ్మదిగా వంటింటి డ్యూటీ పూర్ణకి వచ్చేసింది. శంకర్రావుగారు కూడా వీలయినంతగా భార్యకి సహాయం చేస్తున్నారు.

నళినీ తల్లి పొద్దున్నే లేచి, పూజలో కూర్చునేది. ఏవేవో స్తోత్రాలు చదువుతూ కూర్చునేది. ఆదిత్య వెళ్ళగానే ఆవిడ పూజ అయిపోయి, తన భర్తతో కూతురి గదిలోకి వెళ్ళేది. ఇంక ఆదిత్య మళ్ళీ ఆఫీస్ నుండి వచ్చేవరకు ముగ్గురూ మాట్లాడుకుంటూ ఆ గదిలోనే భోజనాలు, టిఫిన్లన్నీ అక్కడే కానిస్తున్నారు.

పూర్ణ, శంకర్రావుగారులిద్దరూ వాళ్ళు పని అయ్యాక, వాళ్ళ భోజనాలు చేసేసి, కూర్చునేవారు. బాలింతరాలికి పత్యం వండిపెట్టాలని కొత్తలో ప్రయత్నించింది. కానీ నళిని తల్లి అది పడనివ్వలేదు.

"ఈ రోజుల్లో ఈ పత్యాలన్నీ ఎవరు చేస్తున్నారు ఏమీ అవసరంలేద"ని తిప్పికొట్టింది.

"పిల్లాడ్ని పెట్టుకుని వాళ్ళంతా పైనే ఎప్పుడూ ఉండేది. నళిని నాన్నగారు వాళ్ళందరికీ భోజనాలు, టిఫిన్లు పైకి తీసుకువెళతారు. ఆయన వాళ్ళకి పైకి తీసుకెళ్ళిన తర్వాతే పూర్ణ, శంకర్రావుగార్లు తినేవారు.

దుర్గ మధ్య మధ్య ఫోన్ చేస్తూనే ఉంది. ఇక్కడి విషయాలేమీ వీళ్ళు దుర్గకి చెప్పలేదు. కానీ ఒకరోజు మాటల్లో తల్లి మూడుని బట్టి, దుర్గకి అనుమానమొచ్చి గట్టిగా అడిగేసరికి, పూర్ణ ఆపుకోలేకపోయింది.

ఇంక ఆ రోజు జరిగిన సంఘటన చెప్పక తప్పలేదు. ఆరోజు మళ్ళీ ఆదిత్య తల్లి దగ్గరకి వచ్చాడు. కొడుకు దగ్గరకి రాగానే తల్లి కళ్ళు ఒక్కసారి మెరిసాయి. వెంటనే మళ్ళీ ఏమయిందో ఏమంటాడో అని బిక్క మొహం పెట్టుకుని, ఏమీ మట్లాడకుండా కూర్చుంది. ఆదిత్య "అమ్మా! నువ్వు పూజ చెయ్యవా?" అని అడిగేసరికి తెల్లబోయింది.

"మా చిన్నప్పుడు నువ్వు రోజూ దేమునికి దీపం పెట్టి, పూజ చేసేదానివికదమ్మా. ఇప్పుడెందుకు చెయ్యటంలేదు?" అన్నాడు.

పూర్ణకి ఏ సమాధానమివ్వాలో తెలియలేదు. తెల్లబోయి కొడుకు వైపు చూస్తూ కూర్చుంది.

ఆదిత్య మళ్ళీ తనే, "చూడమ్మా మా అత్తగారిని చూడు రోజూ మా కుటుంబ క్షేమం కోసం ఎన్ని స్తోత్రాలు చదువుతున్నారో అసలు బాబు గురించే గంటకి పైగా పూజ చేస్తారుట. నీకలాంటి పూజలేమీ రావా అమ్మా" అన్నాడు.

పూర్ణ శంకర్రావుగార్లు ఒకళ్ళ మొహాలు ఒకరు చూసుకున్నారు. వీడు అంత పెద్ద చదువు చదివి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడా లేక ఆముదాలవలసలో ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాడా అనే సందేహం కలిగింది.

ఏమీ అనలేక బుర్ర అడ్డమో, నిలువో తెలియనట్టుగా ఒక ఊపు ఊపేసి, బిక్క మొహం పెట్టింది పూర్ణ.

"సరేనమ్మా చూడు. నీకలాంటివేమైనా గుర్తొస్తాయేమో" అంటూ వెళ్ళాడు. ఇవాళ జరిగిన ఈ సంఘటన పూర్ణ చెప్పేసరికి దుర్గకి చాలా కోపం వచ్చేసింది. "అమ్మా! నేను వాడితో మాట్లాడతాను" అంది.

"వద్దమ్మా అనవసర గొడవలు వద్దు. మనవాడు అమాయకుడో, మూర్ఖుడో నాకు తెలియటంలేదు. ఏదైనా ఎవరిది వాళ్ళే తెలుసుకోవాలి కానీ ఇంకొకరు చెపితే తెలుసుకోవడం జరగదమ్మా వదిలేయ్. కానీ ఒక్క సహాయం చెయ్యి వాడికి చెప్పి మమ్మల్ని ఇండియాకి పంపించెయ్యమను" అన్నారు కన్నీళ్ళతో.

దుర్గ ఏమి చెప్పిందో పది రోజుల్లోనే ఇండియాకి బయల్దేరారు. అన్నపూర్ణ, శంకర్రావుగార్లు.

దుర్గ ఫోన్ చేసి, ఎంతో బాధపడింది. "అమ్మా! మా దగ్గరకి వచ్చేయండమ్మా" అంది ఏడుస్తూ.

"వద్దమ్మా మాకంటూ ఒక చిన్నగూడు ఉంది. అందులో మేముంటాము" అంది పూర్ణ.

"అమ్మా, నామీద కోపమా? మీరు కష్టపడకూడదని ఉంటుందమ్మా నాకు. అందుకే ఏదో అనేస్తాను, అంతే నన్ను క్షమించమ్మా" అంది దుర్గ.

"అంతంత పెద్ద మాటలెందుకమ్మా నీ బాధ నాకర్ధమయింది. మాకు ఎవరిమీదా కోపం లేదమ్మా. మాది ఏదో సాదాసీదా అయిన జీవితం. ఈ భూమ్మీద ఉన్నన్నాళ్ళూ మా జీవితం మేము జీవిస్తే చాలు. ఏ తల్లీ తండ్రీ అయినా వాళ్ళ పిల్లలు ఎక్కడున్నా సుఖంగా ఉండాలనే కోరుకుంటారు. అలాగే మేము కూడా. మీరిద్దరూ సుఖంగా ఉంటే మాకదే చాలు."

ఇంటి తలుపులు తీసి లోపలికి అడుగుపెట్టి, దుమ్ముతో నిండిన కుర్చీలలోనే కూలబడి గట్టిగా ఊపిరి పీల్చుకుని, ఒకరివైపు చూసుకుని చిన్నగా నవ్వుకున్నారిద్దరూ. శంకర్రావుగారి ఫోన్ మోగింది. నంబరు చూసి భార్య చేతికి ఫోన్ ఇచ్చారు శంకర్రావు గారు.

'హలో' అనగానే అవతలనుంచి కొడుకు "అమ్మా! నన్ను క్షమించమ్మా అక్క చెపితే కానీ నాకు తెలియలేదు" అన్నాడు ఆదిత్య.

"మరేమీ పర్వాలేదులే నాన్నా, మీరు జాగ్రత్తగా ఉండండి. పిల్లాడు జాగ్రత్త" అని ఫోన్ పెట్టేసింది పూర్ణ.

COMMENTS